క్లుప్తంగా

కొనసాగుతున్న నీటి విడుదల

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి గ్రామ సమీపంలోని టెయిల్‌పాండ్ నుంచి దిగువకు శనివారం 10 గేట్ల ద్వారా 3 మీటర్ల ఎత్తు మేరకు దిగువలో ఉన్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి 1,65,726 క్యూ సెక్కులను టెయిల్‌పాండ్‌కు వచ్చి చేరుతుండగా టెయిల్‌పాండ్ నుంచి దిగువకు 1, 64, 279 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని తుంగపాడు ఆదర్శపాఠశాలలో ఆరో తరగతి, ఎనిమిదో తరగతి సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 7వ తే దీ వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషనల్లలో సీట్లు కావాల్సిన విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికట్‌తో హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 98854 56744 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా గౌతమి



దేవరకొండ : యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా దేవరకొండ మండలం మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర గౌత మిరాంసింగ్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను సూచన మేరకు రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఖాలీద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. యువజన కాంగ్రెస్ నిర్వహించిన ఇందిరా ఫెలో, శక్తి అభియాన్ కార్యక్రమంలో క్రియాశీలకపాత్ర పోషించినందుకు గాను ఆమెను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌత మిరాంసింగ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో యువజన కాంగ్రెస్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు ఆమె కృతజ్ఞత లు తెలిపారు.

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

వేములపల్లి : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని సర్వశిక్షా అభియాన్ అడిషనల్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. శనివారం వేములపల్లి మండలంలోని ఆమనగల్లు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రిజిస్టర్, పాఠశాల పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. డిజిటల్ విద్య ద్వారా విద్యార్థుల్లో బోధనా సమర్థ్యాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, హెచ్ఎంలు యోగేశ్వర్, ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండాలి

కొండమల్లేపల్లి : ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఏజీఎం, రీజనల్ మేనేజర్ విజయ్ భాస్కర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని దేవరోనితండాలో నిర్వహించిన ఆర్థిక అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకుల సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్ చెల్లింపులుపై అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ బిజినెస్ దేవేందర్, బ్రాంచి మేనేజర్ చంద్రశేఖర్, నోడల్ ఆఫీసర్ రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్స్ శ్రీహర్ష, అభిలాష్, బ్యాంక్ సిబ్బంది సతీష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులు నిర్బంధం ఆపాలి

పెద్దఅడిశర్లపల్లి : అసైన్డ్ పట్టా కలిగిన సాగుదారులపై ఫారెస్టు అధికారుల నిర్బంధం ఆపాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ కోరారు. శనివారం గుడిపల్లి మండలంలోని ఘట్‌నెమలిపురంలో అసైన్డ్ భూమి పట్టా కలిగిన సాగుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1983లో అసైన్డ్ భూమి పట్టా కలిగిన 22 మంది సాగుదారులపై ఫారెస్టు అధికారులు సాగుచేసుకోకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు కావలి కృష్ణయ్య, రైతులు అంజనేయులు, రామలింగం, చంద్రమౌళి, వెంకన్న, ముత్యాలు తదితరులున్నారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

కొండమల్లేపల్లి : తమలోని క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కుమారుడు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు రమావత్ హిమావంత్‌కుమార్ అన్నారు. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో రమావత్ హిమవంత్‌కుమార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్, లాలయ్య, గిరి, జహంగీర్, శంకర్, చింటూ, మల్లేష్, విష్ణు, కోటేష్ ఉన్నారు.

అండర్‌పాస్‌తో నిరీక్షణకు తెర!

- చిల్లాపురం రోడ్డులో రైల్వే గేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



చిల్లాపురం రోడ్డులో రైల్వే గేటు వద్ద నిర్మించిన అండర్ పాస్

మిర్యాలగూడ అర్బన్ : పెద్దదేవులపల్లి, చిల్లాపురం పరిసర గ్రామాల ప్రజలకు రైల్వే అండర్ పాస్ ఏర్పాటుతో రైలు గేటు కష్టాలు తీరాయి. దీంతో చిల్లాపురం, ఐలాపురం, అజ్మీరాతండా, గోపసంద్రంతండా, పెద్దదేవులపల్లి గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎవరికైనా సుస్తి చేస్తే హుటాహుటిన మిర్యాలగూడ ఆస్పత్రికి వెళ్లాలంటే రైల్వే గేట్ మీదుగా వెళ్లాలి.. ఆ సమయంలో రైల్‌గేట్ పడిందంటే అనారోగ్యంతో ఉన్న వ్యక్తి నరకం చూడాల్సిందే.. ఒక్కోసారి పరిస్థితి విషమించి కొందరు ప్రాణాలు సైతం విడిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో ఆ రోడ్డుగుండా వెళ్లాలంటేనే ప్రజలు ఎప్పుడు గేటు పడుతుందో అని ఆందోళన చెందేవారు. బాధిత గ్రామాల ప్రజలు అనేక మార్లు రైల్వే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు అండర్‌పాస్ నిర్మించాలని వేడుకున్నారు. దీంతో అధికారులు ఎట్టకేలక్ అండర్‌పాస్ నిర్మాణం చేపట్టారు.

గేటు పడితే 15నిమిషాలు ఆగాల్సిందే..

ఒక్కో సమయంలో అత్యవసరంగా ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులను త్వరితగతిన ఆస్పత్రులకు చేర్చాలంటే రైలు గేట్ పడితే 15నిమిషాల నుంచి ఒక్కోసారి 20 నిమిషాలు వరకు రాకపోకలకు అంతరాయం కలిగేది. దీంతో అక్కడి పరిస్థితులను గమనించేందుకు వచ్చిన రైల్వే అధికారులు అండర్ పాస్ నిర్మాణం చేపట్టారు. రైల్వే అధికారులు అత్యంత సాంకేతికతను వినియోగించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా ద్విచక్ర వాహనాలు, ఇతర వ్యవసాయాలకు వినియోగించే వాహనాలు సైతం అండర్ పాస్ నుంచి వెళ్లేలా వేర్వేరుగా రెండు అండర్ పాస్‌లను నిర్మించారు. ఎక్కువగా వర్షాలు కురిసినా వర్షపు నీరు అండర్‌పాస్ లో నిల్వ ఉండ కుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అండర్‌పాస్‌కు సమాంతరంగా ఒక బావిని తవ్వి వర్షపు నీరుంతా ఆ బావిలోకి వెళ్లేలా అండర్‌గ్రౌండ్ గూణల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అండర్‌పాస్ నిర్మాణంతో ఆ రోడ్డుగుండా ప్రయాణించే ప్రజలు ఏళ్ల తరబడి నిరీక్షణ ఫలించిందని, దీంతో సమయంతో పాటు అత్యవసర పరిస్థితుల సమయంలోనూ పట్టణానికి త్వరితగతిన చేరుకుంటున్నమని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలిగాయి



రైల్వేగేట్‌తో గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అత్యవసర పరిస్థితుల్లో పట్టణానికి వెళ్లాంటే రైల్వే గేట్ పడితే సమయం మొత్తం ఇక్కడే గడిచిపోయేది. ఒక్కోసారి విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలన్నా గేటుతో ఆందోళన పడేవారు. అండర్‌పాస్ నిర్మించి ప్రజలకు మంచి చేశారు. దీంతో సమయం ఆదా అవడంతో పాటు సకాలంలో పట్టణానికి చేరుకుంటున్నాం.

– అజ్మీరా మంగ్యా, అజ్మీరాతండా

గేటు పడితే లేటయ్యేది



నేను పాల వ్యాపారం చేస్తాను ఉదయమే గ్రామంలో పాలు సేకరించి మిర్యాలగూడ పట్టణంలో ఆడికల వారికి పాలు పోయాలి. రైల్వే గేటు ఉన్నప్పుడు పాలు తీసుకుని వచ్చే సమయంలోనే గేటు పడేది. దీంతో అరగంటకు పైగా రైల్వేగేటు వద్దే వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో ఉద్యోగస్తులకు పాలు సకాలంలో పోసేవాడిని కాదు. అండర్‌పాస్ నిర్మించిన తరువాత సకాలంలో పట్టణానికి చేరుకుంటున్నాను. అండర్‌పాస్ నిర్మాణం వలన చాలామందికి మేలు జరుగుతుంది.

– నర్సింగ్ సైదులు, చిల్లాపురం

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రజాప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెల్లరేషన్‌కార్డు పంపిణీ కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డును కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత నాగార్జునసాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 10993 నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలో శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం మార్కెట్ యార్డులోని నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విన్నవించామని త్వరలోనే వాట నిర్మాణాలు చేపడుతామని తెలిపారు. రానున్న కొద్ది రోజుల్లోనే నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని సీఎం పర్యటనలో నాలుగు వేయిల ఎకరాలకు అసైండ్ భూమి పట్టాలతో పాటు, ఆర్వోఎఫ్ఆర్ భూములపై, నందికొండలోని ఇంటి హక్కులపై కూడా సీఎం చేత ప్రకటించనున్నట్లు తెలిపారు. అంతకుముందు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఒక లక్షా 23వేల కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గత యాసంగిలో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. తిరుమలగిరి(సాగర్) మండలానికి సంబంధించి అసైండ్‌మెంట్ కమిటి ఆమోదించిన నాలుగు వేయిల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ అనీల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఎంపీపీలు ఆంగోతు భగవాన్ నాయక్, చవ్వా బ్రహ్మానందరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా నాయక్, నాయకులు గడ్డం సాగర్ రెడ్డి, పెంకీసు పాపిరెడ్డి, యాదగిరిరెడ్డి, మునినాయక్, పంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గుర్రంపోడు : పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని సాగర ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొప్పోలు గ్రామంలో ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో పాల్గొని అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో పదేళ్లుగా కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో అనేక సంక్షేమ పథకాలు పొందలేక పోయారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ శేఖర్ రెడ్డి, ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, సర్వయ్య, నాయకులు ఉన్నారు.

రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన



ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 27వ వార్డు శాంతినగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు 18 పథకాలు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు అందించి మాట్లాడారు. గడిచిన 18 నెలల్లోనే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన పేదలకు అందించి వారి మనస్సులన గెలుచుకుందన్నారు. వార్డు ఇన్‌చార్జి గొట్టిముక్కల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరు బాలు, దేశిడి శేఖర్‌రెడ్డి, రాయపాటి వెంకటేశ్వర్లు, తాళ్ల వెంకటేశ్వర్లు, పున్నా శ్రీనివాస్, నాగాచారి, వంశీ, జోసఫ్, రామాచారి, వినోద్, సర్దార్, వెంకన్న, అరుణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్‌ను ఏర్పరచుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్‌ను నిషేధించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య సైకిల్‌యాత్ర శనివారం మిర్యాలగూడలో ముగిసింది. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట రమేష్, జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, జిల్లా అధ్యక్షుడు రవినాయక్, సైన్స్ విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మువ్వా రామారావు, మునీర్, వినోద్‌నాయక్, రెమడాల పరుశురాములు, కోడిరెక్క మల్లయ్య, నాగమణి, పతాని శ్రీను, పల్లా భిక్షం, వదూద్, శ్రీనునాయక్, శంకర్, నగేష్, లింగస్వామి, సుధాకర్, శశిధర్, సాయితేజ, రాజేష్, నగేష్ పాల్గొన్నారు.

'సాక్షి' కలిపింది ఈ ఇద్దరినీ..



చిన్ననాటి మిత్రుడు ఆనంద్‌తో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

నిడమనూరు : తన చిన్ననాటి స్నేహితుడిని చూడాలని ఉందంటూ ఓ పోలీస్ అధికారి వెల్లడించిన మనోగతాన్ని గతేడాది ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ప్రచురించింది. ఆ కథనమే వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయి మిత్రుడి ఆచూకీ తెలిసేలా చేసింది. ఈ ఏడాది జరుపుకున్న సంక్రాంతి పండగ రోజు ఆ ఇద్దరు మిత్రులు కలుసుకున్నారు. నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన నూకల వేణుగోపాల్‌రెడ్డి సైబర్ సెక్యూరిటీస్ విభాగంలో డీఎస్పీగా సంగారెడ్డిలో పనిచేస్తున్నారు. బాల్యమిత్రుడైన ఎం ఆనంద్ గురించి గతేడాది ఆగస్టులో స్నేహితుల దినోత్సవం రోజు బాల్యమిత్రుడి గురించి వివరించారు. 39ఏళ్లుగా తన బాల్య మిత్రుడి కోసం చేస్తున్న అన్వేషణ గురించి వివరించారు. నిడమనూరు మండలంలోని ముకుందాపురం ప్రాథమిక పాఠశాలలో తాము చదుకున్న సమయంలో తన బాల్యమిత్రుడైన ఎం ఆనంద్ గురించి వివరించారు. అతడిని ఎలాగైన కలవాలని పట్టుదలతో ఉన్నట్లు తెలిపారు. ఈ కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. ఆ కథనం వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయింది. దానిని చూసిన ఆయన స్వగ్రామానికి చెందిన స్నేహితులు సైతం అన్వేషణ మొదలు పెట్టారు. ఎట్టకేలకు ఆనంద్ హైదరాబాద్‌లో ఉంటున్నట్లు గుర్తించి అతడి చిరునామా తెలుసుకున్నారు. దీంతో వేణుగోపాల్‌రెడ్డి జనవరిలో జరిగిన సంక్రాంతి పండుగ రోజు ఆనంద్ ఇంటికి వెళ్లి కలిశాడు. ఈ కథనంపై వేణుగోపాల్‌రెడ్డిని సంప్రదించగా...ఏ రంగంలో, ఏ స్థాయిలో ఉన్న చిన్ననాటి మిత్రుల అనుబంధం, ఆనాటి అప్యాయతలు మరువలేనివన్నారు. మిత్రలకోసం, తన వంతు సహాయ. సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

వీరిది విడదీయని స్నేహం

- 50 ఏళ్లుగా కలిసిమెలసి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహ్మద్ ఖాజాహమీదుద్దీన్, మహ్మద్ షకీల్‌లు చిన్నప్పటి నుంచి ఇద్దరు కలిసి పాఠశాలకు వెళ్లేవారు. అయితే షకీల్ పట్టణంలోని జ్యోతి స్కూల్‌లో చదువుతుండగా హామీదుద్దీన్ ఎన్ఎస్పీ క్యాంపు పాఠశాలలో తెలుగు మీడియం చదివేవాడు. కాగా ఎవరి క్లాసులు ముందు వదిలినా వచ్చేవరకు వేచి ఉండి ఇంటికి మాత్రం ఇద్దరు కలిసి వెళ్లేవారు. ఈ ఇరువురు 10వ తరగతి వరకు చదవగా షకీల్ ఉపాధి మార్గాన్ని ఎంచుకొని సాగర్ రోడ్డులో గల పాత బస్టాండ్‌లో పండ్ల వ్యాపారం చేసుకుంటుండగా హామీదుద్దీన్ మాత్రం ఇంటర్మీడియేట్ చదువుతుండగా ఆయన తండ్రికి సంబంధించిన ఉద్యోగం రావడంతో స్థిరపడ్డాడు. ఒకరు ఉద్యోగి అయినా మరోకరు వ్యాపారి అయినా ఇద్దరి అభిప్రాయం మాత్రం ఒక్కటే. ప్రతి విషయంలో కలిసి వెళ్లేవారు. పండుగలు, పబ్బాలు అయినా ఇద్దరు ఒకే అభిప్రాయంపై నడుచుకుంటారు. వీరి స్నేహం 50ఏళ్లుగా వీడదీయలేని అయినప్పటికీ ప్రతి రోజూ కలుస్తునే ఉంటారు.



ఎండీ ఖాజాహమీదుద్దీన్, మహ్మద్ షకీల్

అర్ధరాత్రి యువకుల హల్‌చల్

- పది మంది కలిసి యువకుడిని చితికబాదిన వైనం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో శుక్రవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో కొందరు యువకులు హల్‌చల్ చేశారు. ఓ యువకుడిపై పది మంది కలిసి దాడి చేసి తీవ్రంగా కొట్టారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగడ్డలోని పప్పుమిల్లు వద్ద కొందరు యువకులు అక్బర్ అనే యువకుడిపై దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దుతూ, కాళ్లతో తన్నుతూ ముఖంపై తీవ్రంగా కొట్టారు. ఈ దృశ్యాలు కాలనీలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దాడికి సంబధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికులు భయబ్రాంతులకు గురయ్యారు. కాలనీలో కొంతకాలంగా ఇలాంటి ఘటనలు తరుచూ చోటుచేసుకుంటున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. బాధిత యువకుడు మిర్యాలగూడ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. టూటౌన్ సీఐ సోమనర్సయ్యను వివరణ కోరగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలి



మిర్యాలగూడ : ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ సైదానాయక్

హాలియా : ఎరువుల డీలర్లు ఈ పాస్ మిషన్ ద్వారనే ఎరువులు విక్రయించాలని హాలియా డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ సరిత అన్నారు. మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో నిర్వహించిన ఆరు మండలాల ఎరువుల డీలర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ముద్రించిన ధరల కంటే అధికంగా విక్రయించ రాదని డీలర్లను ఆదేశించారు. ఇతర ప్రొడక్ట్‌ను రైతులకు బలవంతంగా ఇవ్వ కూడదని, స్టాక్ ఉండి కూడా ఎరువులు లేవని రైతులకు చెప్పకూదని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆరు మండలాల ఎరువుల డీలర్లు తదితరులు ఉన్నారు.

వేములపల్లి : ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హేమలత అన్నారు. శనివారం మండలంలోని వేములపల్లి, శెట్టిపాలెం పీఏసీఎస్ కేంద్రాలను ఏవో కిశోర్‌నాయక్‌తో కలిసి సందర్శించి రికార్డులను, ఎరువుల నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, సీఈఓ రవీందర్‌రావు, సైదులు, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మిర్యాలగూడ : ఎరువుల దుకాణ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జ్ ఏడీఏ సైదానాయక్ అన్నారు. శనివారం పట్టణంలో పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి ఎరువుల స్టాక్‌ను, బిల్లులను, స్టాక్ రిజిస్టర్‌ను, రికార్డులను, ఈ పాస్ మిషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరకే ఎరువులు అమ్మాలి

మిర్యాలగూడ : యూరియాను ఎమ్మార్పీ ధరకే అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దామరచర్ల తహసీల్దార్ జవహర్ లాల్ హెచ్చరించారు. శనివారం దామరచర్ల మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అమ్మితే లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ రుషేంద్రమణి, ఏఈఓ సైదులు ఉన్నారు.

ప్రయోగాత్మక విద్యతో బహుళ ప్రయోజనం



పెద్దేవులపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో లెర్నింగ్ పరికరాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురారం : ప్రయోగాత్మక విద్యా బోధన వల్ల విద్యార్థులకు చదువులో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి అన్నారు. శనివారం మండలంలోని పెద్దదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిడమనూరు, మాడుగులపల్లి, త్రిపురారం మండలాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు లెర్నింగ్ ఇంప్రూఫ్‌మెంట్ ప్రోగ్రాం (ఐఎఫ్‌పీ), డిజిటల్ టీవీ తరగతులు, బేస్‌లై టెస్ట్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమావత్ రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు సామర్థ్యాలను రివ్యూ చేసుకుంటూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, టీచింగ్ డైరీతో తరతగతి గదికి హాజరై లెర్నింగ్ అవుట్ కమ్ సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటల్ విద్య వల్ల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమ్మడి సైదిరెడ్డి, చల్లా రవి కుమార్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి ప్రహరీ నిర్మించాలి

చింతపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి ప్రహరీ నిర్మంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేశ్ కంభంపాటి శంకర్ అన్నారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ హాస్టళ్ల సంరక్ష, ప్రభుత్వ విద్య పరిరక్షణకు చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం చింతపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్ విద్యార్థులతో కలిసి నాయకులు సందర్శించారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్, కుంచం కావ్య బుడిగ వెంకటేశ్, స్పందన కోరే రమేష్, మరుపాక కిరణ్, ముస్కు రవిందర్ ఉన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ పరీక్ష ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగదు బహుమతులు అందజేశారు. హైలాన్ కాలనీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మాటూరి వెంకట రమణారావు జ్ఞాపకార్థం మొదటిటాపర్‌కు రూ.3వేలు, సెకండ్ టాపర్‌కు రూ.2వేలు అందజేశారు. అలాగే హిల్‌కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోతుగంటి శ్రీను జ్ఞాపకార్థం మొదటి టాపర్ వరుణ్‌కు రూ.2వేలు, సెంకడ్ టాపర్‌కు రూ1500నల నగదు అందజేశారు. 6నుంచి 9వ తరగతి వరకు తరగతిలో మొదటి స్థానంలో నిలిచి విద్యార్థికి రూ.300లు, రెండో స్థానంలో నిలిచినప విద్యార్థికి రూ.200లు బిగ్‌హెల్ప్‌ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ అందజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శేషు,ప్రాజెక్టు పీడీ రాజబాబు, అవార్డు డైరెక్టర్ అంజయ్య,చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు ఇవ్వాలి

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందకుండా కాంగ్రెస్ నాయకులు ఇతర పార్టీల కార్యకర్తలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ అడక్ మండల కమిటీ అధ్యక్షుడు పావనగుడ్ల వెంకటాచారి అన్నారు. శనివారం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మండలంలోని దుగ్గెపల్లి గ్రామంలో గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా దుగ్గెపల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదలకు న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందే విదంగా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కామర్ల జానయ్య, శ్యాంసుందర్ రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం

నిడమనూరు : కాంగ్రెస్‌తోనే విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయని కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. శనివారం బంటువారిగూడెంలో లోఓల్టేజీ పరిష్కారానికి 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో మండలంలోని విద్యుత్ సమస్య పరిష్కారానికి ఎంతగానో కృషిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శరత్ కుమార్, లైన్‌మన్ మెరుగు శ్రీనివాస్, నాయకులు శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, రాజు, శంకర్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హేమాదేవి

మిర్యాలగూడ టౌన్ : తల్లి ముర్రుపాలు తాపితేనే పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని బండమీదిగూడెం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌జవైజర్ హేమాదేవి అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం కాలువపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి ముర్రుపాలతోనే వ్యాధి నిరోధక టీకా అన్నారు. అలాగే పట్టణంలోని హౌజింగ్ బోర్డు విద్యానగర్ కాలనీలో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం భాగ్యమ్మ తల్లిపాలపై వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇంద్రపల్లి సైదమ్మ, ఎస్‌కె అహ్మదిబేగం, హెల్పర్లు జముకు, ఆరోగ్య హెల్త్ సూపర్‌వైజర్ ఫహీయుద్దీన్, ఆశా వర్కరర్ సైదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు నర్మద, చిన్నమ్మ, తదితరులున్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థినికి గోల్డ్ మెడల్



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మిర్యాలగూడ : నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో జావెలిన్ త్రోలో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని మంచాల హర్షిణి ప్రతిభ చాటి మొదటి స్థానంలో గెలుపొంది గోల్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ జయరాజ్ తెలిపారు. ఈనెల 3,4 తేదీల్లో వరంగల్ జేఎన్.స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హర్షిణి అర్హత సాధించినట్లు తెలిపారు. తమ స్కూల్‌లో విద్యతోపాటు క్రీడలను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జెన్సీ జయరాజన్, హెచ్ఎం సుజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు నీలం రమేష్, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): అడవిదేవులపల్లి మండలం బాలాజీతండాకు చెందిన రమేష్‌కు తిరుమలగిరి సాగర్ మండలం నాయకునితండాకు చెందిన ఓ మహిళతో అక్రమ సంబంధం ఉన్నదనే అనుమానంతో గత నెల 31వ తేదీన ఇరువురిని తండాలోని విద్యుత్ స్తంభానికి కట్టేసి దాడి చేశారు. ఈ క్రమంలో రమేష్ భార్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రస్తుతం కంప్యూటర్ పోటీ ప్రపంచంలో రాణించాలంటే తప్పనిసరిగా మాతృ భాషతో పాటు ఆంగ్లంపై కూడా పట్టుసాధించాలని ప్రవాస భారతీయులు చెరుపల్లి శ్రీనివాస్, చెరుపల్లి అశ్విన్ అన్నారు. శనివారం పట్టణంలోని తడకమళ్ల రోడ్డులో గల శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలకు మూడు కంప్యూటర్‌లతో పాటు పిల్లలకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.